ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పేరిట చిరువ్యాపారులను వేధించొద్దు


ఎమ్మెల్యే కౌసర్‌తో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి

గోల్కొండ: ట్రాఫిక్ స్పెషల్ డ్రైవ్‌లు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పేరిట చిరువ్యాపారులను వేధించొద్దని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా టోలిచౌకీ చౌరస్తా, లంగర్‌హౌస్, నానల్‌నగర్, గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ కోసం తాము చేస్తున్న పనులను వివరించారు. పలు ప్రాంతాల్లో రోడ్లను ఆక్రమించుకొని తోపుడు బండ్ల వారు వ్యాపారాలు చేసుకుంటున్నారని ఎమ్మెల్యేకు తెలిపారు. అదే విధంగా ప్రధాన చౌరస్తాల వద్ద ద్విచక్ర వాహనాల అక్రమ పార్కింగ్ కారణంగా ప్రతినిత్యం ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడడమే కాకుండా ప్రమాదాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలకు తాము వ్యతిరేకం కాదని, అయితే సుదీర్ఘ కాలంగా రోడ్ల పక్కన వ్యాపారం చేసుకుంటున్న వారికి ప్రత్యామ్నాయం చూపించిన తర్వాతే వారిని తొలగించాలని ఆయన అన్నారు. పలు ప్రాంతాల్లో రోడ్లపైనే అక్రమ పార్కింగ్ జరుగుతున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. అయితే అక్రమ పార్కింగ్‌ల నిరోధానికి పక్కాగా చర్యలు తీసుకోవాలని దీనికి తమ మద్దతు ఎప్పుడు ఉంటుందని ఆయన అన్నారు. ట్రాఫిక్ పోలీసులు తోపుడు బండ్ల వ్యాపారులను అకారణంగా వేధిస్తున్న విషయం పలుమార్లు తన దృష్టికి వచ్చిందన్నారు. తోపుడు బండ్లు రోడ్డుపై వస్తేగానీ వారి కుటుంబం జీవించడం కష్టమని ఆయన అన్నారు. ట్రాఫిక్ పోలీసులకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించే హక్కు ఉందని ఈ కారణంగా వ్యాపారులను వేధిస్తే సహించబోమని ఆయన స్పష్టం చేశారు.

షాదీముబారక్ చెక్కుల పంపిణీ..

షేక్‌పేట్, ఆసిఫ్‌నగర్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా షాదీముబారక్ పథకానికి దరఖాస్తు చేసుకున్న వారు తమకు మంజూరు కాలేదని తన వద్దకు వస్తున్నారన్నారు. సాంకేతిక కారణాల వల్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపోయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్, ఆలీముద్దీన్, సయ్యద్ రఫత్ హుస్సేన్ తదితరులున్నారు.

పాలిటెక్నిక్ కళాశాల అలుమ్నీ వేడుకలకు సన్నద్ధం

- డిసెంబర్ 7న మాసాబ్ ట్యాంక్‌లో నిర్వహణ



నాంపల్లి: మాసాబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాల అలుమ్నీ వేడుకలకు సన్నద్ధం అవుతోంది. కళాశాల ప్రారంభమై 65 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు కళాశాల యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. ఈ వేడుకలను డిసెంబర్ 7న మాసాబ్ ట్యాంక్‌లోని కళాశాల ప్రాంగణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించేందుకు మాసాబ్ ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాల అలుమ్నీ అసోసియేషన్ కసరత్తు చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసేందుకు పూర్వ విద్యార్థులు కళాశాల సిబ్బంది సిద్ధమయ్యారు. పాలిటెక్నిక్ కళాశాల 1959లో ప్రారంభించారు. ఇక్కడ సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, కంప్యూటర్ సైన్స్ వంటి ఏడు రకాల కోర్సులను బోధిస్తున్నారు. సుమారు రెండు వేల మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు.

అప్‌గ్రేడ్ దిశగా అడుగులు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు మహర్దశ పట్టుకుంది. ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని కోస్గిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ ఆదేశాలు వచ్చాయి. ఇందులో భాగంగానే హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు మంచి రోజులు వస్తాయనే ఆశలు చిగురిస్తున్నాయి. అప్‌గ్రేడ్ అయ్యే కళాశాలల్లో మాసాబ్ ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాల అగ్రస్థానంలో ఉంది. ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయితే అధునాతన భవన సముదాయాలు, హాస్టల్స్ నిర్మాణాలు జరుగుతాయి. ప్రస్తుతం కొనసాగుతున్న కళాశాల వర్షం వస్తే తరగతి గదులన్నీ తడిసి ముద్దవుతున్నాయి. ల్యాబొరేటరీ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వసతి గృహంలో చాలా గదులన్నీ మూతపడ్డాయి. మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా తయారయ్యింది. అప్‌గ్రేడ్ ఉత్తర్వులు వస్తే కార్పొరేట్ స్థాయి ఇంజినీరింగ్ కళాశాలగా రూపు మారిపోతుంది.

అప్‌గ్రేడేషన్ జరిగితే విద్యార్థులకు మేలు..



మాసాబ్ ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాల అప్‌గ్రేడేషన్ జరిగితే విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుంది. పాలిటెక్నిక్ కళాశాల ఇంజినీరింగ్ కళాశాలగా మారితే మెరుగైన వసతి సౌకర్యాలు అందుతాయి. పరికరాలు సమకూరడమే కాకుండా ఆధునిక హంగులతో లేబోరేటరీ అందుబాటులోకి వస్తుంది. సీఎం రేవంత్‌రెడ్డి స్కిల్ డెవలప్‌మెంట్ మీద ప్రత్యేక దృష్టిని సారించడం అభినందనీయం. పాలిటెక్నిక్ కళాశాలలను అప్‌గ్రేడ్ చేసే యోచన చేయడం భావితరాలకు బంగారు బాటలు వేసినట్లు అవుతుంది. అదే విధంగా డిసెంబరు 7న కళాశాల ప్రాంగణంలో అలుమ్నీ వేడుకలను ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

– చంద్రశేఖర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్

వైభవంగా కుంకుమార్చన



అబిడ్స్: గుడిమల్కాపూర్ సాయిబాబా త్రయంబకేశ్వర ఆలయంలో శుక్రవారం కుంకుమార్చన, వన భోజనాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగేందర్, ఉపాధ్యక్షుడు గరిధర్‌తో పాటు కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

మేరు కులస్తులకు ప్రాధాన్యమివ్వాలి



అఫ్జల్‌గంజ్: మేరు కులస్తులకు కాంగ్రెస్ ప్రభుత్వం తగిన ప్రాధాన్యమివ్వాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మేరు యువజన సంఘాల అధ్యక్షుడు, రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో మేరు కులస్తులంతా కాంగ్రెస్ పార్టీని గెలిపించడంలో కీలకపాత్ర వహించారన్నారు. మేరు కులస్తులు సామాజికంగా రాజకీయంగా అభివృద్ధి చెందే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం మరిన్ని నామినేటెడ్ పదవులు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో చురుకైన నాయకుడిగా ఉంటున్న తనకు నామినెటెడ్ పదవి ఇప్పించేందుకు కృషి చేయాలని దానం నాగేందర్‌కి విజ్ఞప్తి చేశారు. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే ఉపేక్షించబోం

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి


తనిఖీలు చేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

సాక్షి, సిటీబ్యూరో: కలుషిత, అపరిశుభ్రమైన, నాణ్యతలేని నాన్ వెజ్ విక్రయాలు చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే ఉపేక్షించబోమని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం ఇసామియా బజార్ న్యూ మోతీనగర్‌లోని ఏపీసీ చికెన్ మార్కెట్‌ను ఆమె ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ వెదజల్లుతున్న దుర్గంధం, అపరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం చూసి చికెన్ మార్కెట్ నిర్వాహకులపై మేయర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితులిలా ఉంటే ఏం చేస్తున్నారు, తనిఖీలు చేస్తున్నారా? జరిమానా వేశారా? అంటూ స్థానిక ఏఎంఓహెచ్‌ను ప్రశ్నించారు. పెద్ద మొత్తంలో జరిమానా విధించకుండా, సరైన చర్యలు తీసుకోకపోవడంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. వెంటనే సదరు చికెన్ మార్కెట్‌ను సీజ్ చేయాల్సిందిగా జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులతో ఈ తనిఖీ చేసినట్లు చెప్పారు. ఎంటమాలజీ, శానిటేషన్ అధికారులు సమన్వయంతో పరిసరాలు పరిశుభ్రం చేయడంతో పాటు ఫాగింగ్ నిర్వహించాలని ఆదేశించారు.

డిసెంబర్ 2 నుంచి అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాదం

చార్మినార్: దీక్షలో ఉన్న అయ్యప్ప స్వాములకు డిసెంబర్ 2వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు ప్రతిరోజూ ఉచితంగా అన్న ప్రసాదం అందజేయనున్నట్లు మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా భిక్ష కోసం సమయం లేని వారికి అన్న ప్రసాదాన్ని వారి వారి బాక్సుల్లో అందజేయబడుతుందన్నారు. ఇందుకోసం అయ్యప్ప స్వాములు ఖాళీ టిఫిన్ బాక్సులను తమ వెంట తీసుకువచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించాలని ఆయన కోరారు. ప్రతిరోజూ ఉదయం 7 నుంచి 10 గంటల వరకు ఆలయ ప్రాంగణంలో ఈ ఉచిత అన్న ప్రసాదం అందజేయడం జరుగుతుందన్నారు. దీనిని దీక్షలో ఉన్న అయ్యప్ప స్వాములు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కష్టపడే వారికే కాంగ్రెస్ పార్టీలో ప్రాధాన్యం


మహేష్‌కుమార్‌తో కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: కష్టపడే వారికే కాంగ్రెస్ పార్టీలో ప్రాధాన్యం ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం కార్వాన్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ ఆయనను కలిశారు. రాష్ట్రంలో త్వరలో చేపట్టబోయే ఏకలవ్య కార్పొరేషన్ పదవిని పార్టీలో ఉంటూ క్రియాశీలకంగా పని చేస్తున్న ఎరుకల కులస్తులకే కేటాయించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తుందని, దీని కోసం నిధులు కూడా సమకూరుస్తుందన్నారు. పార్టీ కోసం పని చేస్తున్న ఎరుకల కులస్తులకే ఏకలవ్య కార్పొరేషన్ పదవిని ఇవ్వడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ముగిసిన సంప్రదాయ కళల ఉత్సవం


కళాకారులను సన్మానిస్తున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ 47వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నాలుగు రోజులుగా రవీంద్రభారతిలో జరుగుతున్న సంప్రదాయ కళల ఉత్సవం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ..ప్రస్తుత సమాజంలో అంతరించిపోతున్న జానపద కళలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ఇందుకు కళా సంస్థలను ప్రోత్సహించాలని సూచించారు. అంతకు ముందు అన్నమయ్య, పార్వతీ కల్యాణం, అంశాలపై ప్రదర్శించిన హరికథ గానం ఆహుతులను ఆకట్టుకుంది. అనంతరం పలువురు కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణుగోపాల చారి, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజ్యలక్ష్మి తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రతి ఒక్కరూ మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని వాసవి మహిళా సమాఖ్య ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ఉప్పల రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం రవీంద్ర భారతిలో ప్రముఖ రచయిత అరుణ్ కొత్త రచించిన 'కురుక్షేత్ర అనుస్మరనాయ'పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..250 బీసీ నాటి కాలంలో జరిగిన కథకు గణిత శాస్త్రానికి, కురుక్షేత్ర యుద్ధానికి అనుసంధానం చేస్తూ పుస్తకాన్ని రాయడం అభినందనీయమన్నారు. రచయితకు కలలో వచ్చిన కథను కురుక్షేత్ర యుద్ధంతో మిళితం చేసి పుస్తకాన్ని తీసుకురావడాన్ని కొనియాడారు. అనంతరం మహాభారతంపై క్విజ్ పోటీలను నిర్వహించి ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంపొందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత బొగ్గారపు వరుణ్, కిరణ్‌గుప్తా, పోలా శ్రీనివాస్, కిరణ్‌కుమార్, కొత్త ప్రియ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నిమోనియాపై ప్రత్యేక శ్రద్ధ అవసరం


డాక్టర్ రవికుమార్

నాంపల్లి: శీతాకాలంలో చిన్నారులపై నిమోనియా దాడిచేసే అవకాశం ఉందని నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.రవికుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుందన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులపై నిమోనియా ఎక్కువగా ప్రభావం చూపే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి చిన్నారులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధను కనబరచాలని కోరారు. ఉదయం, సాయంత్రం వేళల్లో అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని కోరారు. చిన్నారులకు సుస్తీ చేస్తే అనుభవజ్ఞులైన వైద్యులను సంప్రదించాలని, వైద్యుల సలహా మేరకే అతడు సూచించిన మందులను వాడాలని పేర్కొన్నారు.

రూ.2 కోట్లతో నూతన భవన నిర్మాణానికి చర్యలు


పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ

యాకుత్‌పురా: రూ.2 కోట్లతో నిధులతో దారుషిఫా ప్రభుత్వ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ అన్నారు. దారుషిఫా ప్రభుత్వ ఇంగ్లిష్, ఉర్దూ మీడియం పాఠశాలలో నెలకొన్న సమస్యలపై శుక్రవారం ఆయన స్థానిక కార్పొరేటర్, పలు విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దారుషిఫా పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నిత్యం సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే అభివృద్ధి నిధుల నుంచి రూ.2 కోట్లను కేటాయించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ పర్యటనలో పత్తర్‌గట్టీ కార్పొరేటర్ సయ్యద్ సోహెల్ ఖాద్రీ, జీహెచ్ఎంసీ చార్మినార్ సర్కిల్ డీసీ సరిత, బహదూర్‌పురా మండల డిప్యూటీ ఈఓ పూనీత్ నాయక్, ప్రధానోపాధ్యాయురాలు రియసాత్ పారూఖీ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మెట్టు సాయికుమార్



అబిడ్స్: ఉత్తమ ఇన్ ల్యాండ్ ఫిష్ అవార్డుతో రాష్ట్ర ఫిషరీష్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. 2024వ సంవత్సరానికి తెలంగాణ ఫిషరీష్ డిపార్ట్‌మెంట్‌కు కేంద్ర ప్రభుత్వం ఉత్తమ ఇన్ ల్యాండ్ ఫిష్ అవార్డు అందజేసింది. శుక్రవారం అవార్డుతో రేవంత్‌రెడ్డిని కలిసి శభాష్ అనిపించుకున్నాడు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

లక్ష పుష్పార్చన



చాంద్రాయణగుట్ట: కార్తీక మాసోత్సవాలలో భాగంగా రక్షాపురంలోని శివాలయంలో శుక్రవారం లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. తెల్లవారుజామునే నిర్వహించిన అన్నాభిషేకం అనంతరం మహిళా భక్తులు భారీగా తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించి పూజా కార్యక్రమాలు కొనసాగించారు. ఆలయ ప్రధాన అర్చకులు నేతి మాధవ శర్మ, ఈవో శ్రీనివాస్, ఆలయ ఇన్‌చార్జి పార్థసారథి, స్థానిక పెద్దలు బొట్టు శ్రీను, గౌరి శంకర్ గౌడ్, రవి, సాయి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ధన్యవాదాలు

యాకుత్‌పురా: దారుషిఫా ప్రభుత్వ ఇంగ్లిష్, ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి 5 మెన్ కమిటీని నియమించడంపై పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ మసూదుద్దీన్ హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ..పాఠశాల భవనంలో పురాతన డ్రైనేజీ పైప్‌లైన్లు శిథిలావస్థకు చేరుకోవడంతో కొన్ని నెలలుగా మురుగు నీటి సమస్య తలెత్తుతుందన్నారు. సమాచారం అందుకున్న కలెక్టర్ గురువారం జిల్లా విద్యాశాఖ అధికారిణి రోహిణి, పలువురు అధికారులతో కలిసి పాఠశాలను సందర్శించారన్నారు. సమస్యలను వారంలోపు పరిష్కారించేందుకు అయిదుగురు ఉన్నత స్థాయి అధికారులతో 5 మెన్ కమిటీని నియమిచారన్నారు. ఈ కమిటీలో హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారిణి రోహిణి, జీహెచ్ఎంసీ చార్మినార్ సర్కిల్ డీసీ సరిత, బహదూర్‌పురా తహసీల్దార్ చంద్రశేఖర్, మండల డిప్యూటీ ఈఓ పునీత్ నాయక్, కలెక్టర్ కార్యాలయ ఈఈ షఫీని నియమించి వెంటనే నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని ఆయన తెలిపారు.

అభినందనలు


గవర్నర్‌ను కలిసిన డాక్టర్ రేవతి

గన్‌ఫౌండ్రీ: విదేశాల్లో స్థిరపడిన ఎన్ఆర్ఐలు తిరిగి భారతదేశానికి సేవ చేయాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లో జరిగిన ఫెలీనా మిస్సెస్ ఇండియా విజేతగా నిలిచిన డాక్టర్ సూర్య రేవతి మెట్టుకుమార్ శుక్రవారం గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. భారత్ మాతా సేవా పురస్కార్, ఇన్‌ఫ్లూయెన్సర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అవార్డులను గెలుచుకోవడంపై ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా–స్ట్రాంగ్ ఇండియా అనే నినాదంతో గ్రామాలను దత్తత తీసుకోవడం, విద్యా సాధికారతకు కృషి చేయడం, వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం వంటి ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు గవర్నర్‌కు తెలియచేశారు. తాను చేస్తున్న సేవలు, పొందిన అవార్డులను గుర్తించి గవర్నర్ అభినందించడంపైఆమె కృతజ్ఞతలు తెలిపారు.

డిజిటల్ శిక్షణ కోసం సిటీ కాలేజీ ఒప్పందం



చార్మినార్: సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా బీకాం, బీబీఏ విద్యార్థులకు డిజిటల్ శిక్షణ అందించేందుకు టీఎస్ఎఫ్ ఇండియా ఫౌండేషన్‌తో 200 గంటల డిజిటల్ శిక్షణ కోసం ఒప్పందం కుదుర్చుకున్నామని ప్రభుత్వ సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ తెలిపారు. విద్యా ప్రణాళికలు, పరిశ్రమ అవసరాల మధ్య గల అంతరాన్ని తగ్గించి విద్యార్థులను వారెంచుకున్న కెరీర్లకు సిద్ధం చేయడానికి ఈ శిక్షణ రూపొందించబడిందన్నారు. శిక్షణ ప్రధానంగా తరగతి గదుల్లో నిర్వహించబడుతుందని, ప్రత్యేకంగా రూపొందించిన డిజిటల్ ప్లాట్‌ఫారం ద్వారా అవసరమైనప్పుడు విద్యార్థులకు అనుకూలంగా కొనసాగుతుందని తెలిపారు. తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను సాంకేతికత సహాయంతో ఉద్యోగ, ఉపాధి కేంద్రంగా అవగాహన చేసుకోవడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డా.మల్లికార్జునరావు తెలిపారు. ఈ శిక్షణ విద్యార్థుల ఉద్యోగ అవకాశాలు, కెరీర్ అభివృద్ధి మెరుగుదలకు సహాయపడుతుందని, శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్ అవకాశాలు కల్పించబడతాయని టీఎస్ఎఫ్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధి రగని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి.శిరీష, ఇఫత్ ఉన్నీసా, డాక్టర్ రవీంద్రబాబు, లలిత, సైదులు తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



సాక్షి, సిటీబ్యూరో: సత్యసాయిబాబా జయంతిని పురస్కరించుకుని సత్య సాయి సేవా సంస్థ సెప్టెంబర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీల్లో గుడిమల్కాపూర్‌లోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థిని మాలాకుమారి ద్వితీయ స్థానంలో నిలిచింది. గురువారం రాత్రి శివం రోడ్డులోని సత్యసాయిబాబా సేవా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేయడంతో పాటు వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెయింట్ మేరీస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి, ప్రధానోపాధ్యాయుడు భిక్షపతి, సునీత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'సాంఘిక శాస్త్రంలో రీసెర్చ్ మెథడాలజీ'పై సదస్సు


కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు

గోల్కొండ: సాంఘిక శాస్త్రంలో రీసెర్చ్ మెథడాలజీ ప్రవేశపెట్టడంతో ఆ విభాగానికి సంపూర్ణ న్యాయం చేకూరుతుందని ఎడ్యుకేషనల్ ట్రైనర్, ప్రొఫెసర్ కస్తూరి అలివేలు అన్నారు. శుక్రవారం మెహిదీపట్నం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో 'సాంఘిక శాస్త్రంలో రీసెర్చ్ మెథడాలజీ'అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విభిన్న సేవలకు సహకారిగా విద్యార్థులను వివిధ ఆర్థిక, సామాజిక పరిశోధనలలో పాల్గొనేలా ప్రోత్సహించాలని అధ్యాపకులకు సూచించారు. ఈ పరిశోనలు సమాజ అభివృద్ధికి దోహదపడతాయన్నారు. విద్యార్థులు చేస్తున్న పరిశోధనల ప్రాముఖ్యతలు వివరించి పరిశోధనలో ఎలా ముందుకు సాగాలన్నదానిపై పరిశోధనకులకు అవగాహన కల్పించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ శంకర్, కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ విజయ రాణి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తాగుతున్న ముగ్గురికి జైలు

గౌలిపురా: గంజాయి తాగుతున్న ముగ్గురికి నెల రోజుల పాటు శిక్ష విధించిన ఘటన భవానీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. ఆగాపురా ప్రాంతానికి చెందిన రాజేశ్ (25), గులాం సందాని (19), షేక్ అక్రం (24)లు భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల గంజాయి తాగుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో వీరిపై కేసు నమోదు చేసుకొని శుక్రవారం ముగ్గురు నిందితులను నాంపల్లిలోని కోర్టులో హాజరు పరచగా పూర్వ పరాలను పరిశీలించిన స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ డి.సి.ఉమాపతి రావు ముగ్గురికి నెల రోజుల పాటు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

హత్య కేసులో ఇద్దరి రిమాండ్

ఏడుగురు మైనర్ బాలులను జువెనైల్ హోమ్‌కు తరలింపు

సంతోష్‌నగర్: ఊరేగింపులో జరిగిన చిన్నపాటి గొడవ కారణంగా యువకుడిని దారుణంగా హత్య చేసిన కేసులో శుక్రవారం సంతోష్‌నగర్ పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా.. మరో ఏడుగురు మైనర్ బాలులను జువెనైల్ హోమ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన మహ్మద్ సాజిద్, షేక్ ఫయాజ్‌తో పాటు మరో ఏడుగురు మైనర్ బాలులు కలిసి ఈ నెల 20వ తేదీన రాత్రి 11.30 గంటల సమయంలో జన్మదిన వేడుకలు నిర్వహించుకుంటున్నారు. అనంతరం సమీపంలోని దర్గా వద్ద జరుగుతున్న ఊరేగింపులో పాల్గొన్నారు. అదే సమయంలో ఎంబీ హట్స్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అనాస్‌తో గొడవ జరిగింది. అనాస్ తన సోదరుడు మహ్మద్ మోహిత్ ఖాన్ (18)కు ఫోన్ చేశాడు. మోహిత్ ఖాన్ తన స్నేహితులతో కలిసి వచ్చి మైనర్ బాలులతో పాటు ఇద్దరు యువకులపై దాడి చేశారు. దీంతో మహ్మద్ సాజిద్, షేక్ ఫయాజ్‌తో పాటు ఏడుగురు మైనర్ బాలులు జన్మదినం సందర్భంగా తమ వెంట తెచ్చుకున్న కత్తితో ఒవైసీ కాలనీ ఫజల్ కేఫ్ వద్ద మోహిత్ ఖాన్‌పై దాడి చేసి హత్య చేశారు. దీంతో స్థానికులు, కుటుంబసభ్యులు మోహిత్ ఖాన్‌ను ఒవైసీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శుక్రవారం హత్యకు పాల్పడిన మహ్మద్ సాజిద్, షేక్ ఫయాజ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా ఏడుగురు మైనర్ బాలులను జువెనైల్ హోమ్‌కు తరలించారు.

అధికారులు స్పందించారు.. ఆక్రమణలను తొలగించారు..

నాంపల్లి: 'కనిపించని కాలిబాటలు'శీర్షికన ఈ నెల 20న ప్రచురితమైన కథనానికి నాంపల్లి ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ఫుట్‌పాత్‌లపై వెలసిన ఆక్రమణలను తొలగించారు. ఇందులో భాగంగానే నిలోఫర్ ఆసుపత్రి, నాంపల్లి రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ హెచ్చరించారు. పాదచారుల కోసం ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై వ్యాపారస్తులు రాజకీయాలు చేస్తే భయపడేది లేదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సాక్షి ఎఫెక్ట్..


నాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

భక్తిశ్రద్ధలతో ఉర్సు



జియాగూడ: జియాగూడలోని కమరేకి గుమ్మజ్‌లో 372 ఉర్సు షరీఫ్ వేడుకలు గురువారం రాత్రి ఘనంగా జరిగాయి. పురానాపూల్ నుంచి సందల్ ఊరేగింపు కమరేకి గుమ్మజ్‌కు తీసుకొచ్చి సమర్పించారు. మూడు రోజుల పాటు దర్గాహ్ హజరత్ సయ్యద్‌షా మీరన్ ఖుదానుమై హుస్సేని చిస్తీ–ఉల్ ఖాద్రీ (ఆర్‌హెచ్) వేడుకలను ప్రారంభించినట్లు సయ్యద్ చందా హుస్సేని ఖుదానుమై జానషీన్ ఈ మీరన్ ఖుదానుమై హుస్సేని (ఆర్‌హెచ్) తెలిపారు. ఈ సందల్ కార్యక్రమానికి హాజరైన మత గురువులను ఘనంగా సన్మానించారు. శనివారం వరకు చిరాగన్ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.

అన్నదానం



అబిడ్స్: టీఎన్జీవోస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. శుక్రవారం మెహిదీ నవాబ్ జంగ్ ఆసుపత్రి వద్ద దాదాపు 600 మంది నిరుపేద రోగుల సహాయకులకు అల్పాహారం, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ..సమాజ సేవ చేసేందుకు తాను జీవితాంతం ముందుంటానన్నారు. హైదరాబాద్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, ఎన్ఆర్ఐలు ముబారజుద్దీన్ ముజీహిద్, సయ్యద్ అసదుద్దీన్, కుర్రాడి శ్రీనివాస్, వైదిక్ శాస్త్రి, బొల్లిగిద్ద శంకర్, చంద్రశేఖర్, ముస్తఫా షరీఫ్ పాల్గొన్నారు.